## క్లుప్తంగా

### బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి



బ్రిడ్జి వద్ద నాయకులు

**తంగళ్లపల్లి:** రెండేళ్లుగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజుయాదవ్ అన్నారు. బ్రిడ్జిని ఆదివారం సందర్శించారు. రెండు సంవత్సరాల క్రితం చీర్లవంచ, వల్లంపట్ల మధ్యలో బ్రిడ్జి నిర్మాణం మొదలుపెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కడి పని అక్కడే ఆగిపోయిందని అన్నారు.

### 'డిగ్రీ కళాశాల రద్దుకు కుట్ర'

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రద్దు చేయడానికి కుట్రలు పన్నుతున్నారని, కొట్లాడి సాధించుకున్న కళాశాలను రద్దు చేస్తే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడేళ్ల క్రితం మండలానికి కళాశాలను మంజూరు చేశారన్నారు. కళాశాలలో విద్యార్థుల ప్రవేశాల కోసం ప్రచారం చేసి పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించి అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

### ఉపాధ్యాయుల బడిబాట



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

**ఇల్లంతకుంట:** బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్జీటీ యూనియన్ సభ్యులు సిరికొండ, జంగారెడ్డిపల్లి, పలు గ్రామాల్లో శనివారం పర్యటించి సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న వివిధ సదుపాయాలను వివరించారు. రాష్ట్ర ఎస్జీటీ యూనియన్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మండల బాధ్యులు శ్రీనివాస్, సత్యం, ఆకుల కిషన్, తూముకుంట నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కురుమ సంఘం అధ్యక్షుడిగా రమేశ్

**ఇల్లంతకుంట:** ఎర్రనర్సుపల్లె గ్రామ కురుమ సంఘం అధ్యక్షుడిగా చుక్క రమేశ్‌ను ఏకగ్రీవంగా సంఘ సభ్యులు ఆదివారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా తొత్తుల ఎల్లయ్య, కోశాధికారిగా తొత్తుల ఐలయ్య, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### రజక సంఘం అధ్యక్షుడిగా రవి



రవిని సన్మానిస్తున్న సభ్యులు

**ఎల్లారెడ్డిపేట:** పదిర గ్రామ రజక సంఘం అధ్యక్షుడిగా కంచర్ల రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన నూతన కార్యవర్గం ఎన్నికల్లో ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రేపాక నర్సయ్య, కోశాధికారిగా నర్సయ్య, సభ్యులుగా కంచర్ల శ్రీనివాస్, నరేశ్ ఎన్నికయ్యారు. సభ్యులు సన్మానించారు.



రామన్నపేట రెడ్డి సంఘం కార్యవర్గం

**బోయినపల్లి:** రాళ్లరామన్నపేట గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్టపల్లి మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా చింతపల్లి మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుడి తిరుపతిరెడ్డి, కార్యదర్శిగా చింతపల్లి భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా సింగిరెడ్డి లచ్చిరెడ్డి, సభ్యులుగా ఏనుగు జనార్దన్‌రెడ్డి, అన్నటి బాల్‌రెడ్డి, ముస్కు మనోహర్‌రెడ్డి, మిట్టపల్లి లచ్చిరెడ్డి ఎన్నికయ్యారు.

**తంగళ్లపల్లి:** గోపాల్‌రావుపల్లిలో రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా కూతురి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా బెంద్రపు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆలూరి బాల్‌రెడ్డి, కోశాధికారిగా దూది రామచంద్రారెడ్డి ఎన్నికయ్యారు.

**కోనరావుపేట:** మంగళ్లపల్లి గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా వెలిశాల రెడ్డి ఎన్నికయ్యారు. గ్రామంలోని సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సాగర్ల రాజిరెడ్డి, కార్యదర్శిగా బాదినేని నారాయణ, కోశాధికారిగా బాదినేని నర్సయ్య, సభ్యులుగా వెలిశాల శ్రీనివాస్, కొమిరెడ్డి అంజయ్య, ఉప్పుల రాములు, అవురం నర్సయ్య, కొమిరెడ్డి అంజయ్య, దేవయ్య ఎన్నికయ్యారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న శిథిలమై సీసీ రోడ్డు కంటే తక్కువ ఎత్తులో ఉండి చెత్తాచెదారంతో నిండిపోయి మురుగు నిలిచిపోయిన డ్రైనేజీ రుద్రంగి మండల కేంద్రంలోని మహాలక్ష్మి కాలనీలోనిది. కొన్ని నెలలుగా ఈ డ్రైనేజీ ఇలాగే చెత్తతో నిండిపోయి మురుగు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతూ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఇది రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన గల ఖాళీ స్థలం. చెత్త, కోళ్ల వ్యర్థాలు, చనిపోయిన పశువుల కళేబరాలు తీసుకువచ్చి కాలేజీ పక్కనే పడేయడంతో కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు, అటుగా వెళ్లే ప్రజలు చెత్త, కళేబరాలు, కోళ్ల వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే డంపింగ్ యార్డ్ ఉన్నా చెత్త వేసేలా చర్యలు చేపట్టకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని కళాశాల సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

# పారిశుధ్యం.. అస్తవ్యస్తం

**రుద్రంగి:** రుద్రంగి మండల కేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. పారిశుధ్య పనులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారై చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి కంపు కొడుతోంది. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయి మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి కాలనీలు కంపు కొడుతున్నాయి. మురుగుపై ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. చెత్త, మురుగు నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

**సీసీ రోడ్లు వేసి.. డ్రైనేజీలు మరచి..**

అభివృద్ధి పనుల్లో భాగంగా కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. కానీ శిథిలావస్థలో ఉన్న డ్రైనేజీలను అలాగే వదిలేయడంతో సీసీ రోడ్లు డ్రైనేజీల కంటే ఎత్తు పెరగడంతో ధ్వంసమైన డ్రైనేజీల్లో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి మురుగు నిలిచిపోతోంది.

### మురుగు ఇళ్లలోకి..



సీసీ రోడ్డు ఎత్తు పెంచి డ్రైనేజీ తక్కువ ఎత్తులో ఉండడంతో శిథిలమైన డ్రైనేజీల వద్ద చెత్త పేరుకుపోతోంది. వర్షాలు కురిసినప్పుడు వరద నీటితోపాటు మురుగు ఇళ్లలోకి వస్తోంది.

– దేశవేణి గిరిధర్, రుద్రంగి

### భరించలేని దుర్వాసన



రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన పడేసే చెత్త, కోళ్ల వ్యర్థాలు, పశువుల కళేబరాలతో భరించలేని దుర్వాసన వస్తోంది. అటుగా వెళ్లాలంటేనే భయమైతంది.

– గండి అశోక్, రుద్రంగి

### ప్రతిపాదనలు పంపాం

రుద్రంగిలో శిథిలమైన డ్రైనేజీల నిర్మాణాల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే డ్రైనేజీల నిర్మాణాలు చేపడతాం.

– నట్రాజ్, ప్రత్యేకాధికారి, రుద్రంగి జీపీ, ఎంపీడీవో



సిరిసిల్లలో పూర్వ విద్యార్థులు



బోయినపల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

### అ'పూర్వ' సమ్మేళనం

**సిరిసిల్లటౌన్:** స్థానిక వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో 1998–99లో 10వతరగతి చదివిన విద్యార్థులు 25 ఏళ్ల అనంతరం కలుసుకున్నారు. పట్టణంలోని లహరి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి కరస్పాండెంట్ లింగారెడ్డితో పాటు ఉపాధ్యాయులను సత్కరించారు.

**బోయినపల్లి(చొప్పదండి):** బోయినపల్లి హైస్కూల్‌లో 2006–07 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు.



తంగళ్లపల్లి: విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**తంగళ్లపల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 2005–06 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు.

### ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

**ఎల్లారెడ్డిపేట:** ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం అన్నారు. మండల కేంద్రంతోపాటు అక్కపల్లి, పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, నాయకులు ఎస్‌కే గౌస్, బండారి బాల్‌రెడ్డి, మెండే శ్రీనివాస్, పందిర్ల లింగంగౌడ్, గంట బుచ్చాగౌడ్, రాములు, రాజు, వంగ మల్లారెడ్డి, రామచంద్రం, గుల్లపల్లి లక్ష్మారెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

**కోనరావుపేట:** మల్కపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఏఎంసీ వైస్ చైర్మన్ తాళ్లపెల్లి ప్రభాకర్ ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. సీనియర్ నాయకులు బొర్ర రవీందర్, పాకాల వినయ్‌గౌడ్, కర్రోళ్ల భాస్కర్, బోయిని దేవరాజు, కుంట వెంకటేశ్, ఎదురుగట్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



అక్కపల్లిలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

### సాధనాశూరుల ప్రదర్శన



**రుద్రంగి:** మండల కేంద్రంలోని ఇందిరాచౌక్‌లో రుద్రంగి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాధనాశూరుల ఆట ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి వీక్షించారు.



నర్సక్కపేటలో బోనాలతో మహిళలు



రామన్నపేటలో..

# పోచమ్మ బోనాలు

**ఇల్లంతకుంట:** నర్సక్కపేట, పొత్తూరు, గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో బయలుదేరి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

**కోనరావుపేట:** రామన్నపేటలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి పోచమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



**తంగళ్లపల్లి:** రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఓ యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. పద్మనగర్‌లోని వీరాంజనేయ రైస్ మిల్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగి పక్కన పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని స్థానికులు చూసి 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### కాంగ్రెస్ యువ నాయకుడు మృతి



మహేందర్(ఫైల్)

**తంగళ్లపల్లి:** నేరెళ్లలో కాంగ్రెస్ యువ నాయకుడు వేల్పుల మహేందర్ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సిరిసిల్లలోని ఆసుపత్రిలో మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడుకి భార్య సంధ్య(32), వైష్ణవి(13), శ్రీహాస్ ఉన్నారు.

### మహాసభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రాములు

**చందుర్తి:** సిరిసిల్ల పట్టణంలో ఈనెల 14న తలపెట్టిన సీపీఐ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు కోరారు. ఆదివారం చందుర్తి మండల కేంద్రంలో సీపీఐ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా మహాసభల అధ్యక్షులు మీసం లక్ష్మణ్, ఇందిర, కొమురవ్వ, లలిత, బొడ్డు నర్సయ్య, మల్లేశం, గడ్డం మల్లవ్వ, లావణ్య, రాజేశ్వరి, పద్మ, రేణుక, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

### పోచమ్మ ఆలయంలో శాంతి హోమం



**బోయినపల్లి(చొప్పదండి):** తడగొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శాంతి హోమం నిర్వహించారు. పలువురు దంపతులు భక్తిశ్రద్ధలతో హోమం చేశారు. దేవతామూర్తుల విగ్రహాలకు ధన, ధాన్య, ఫల, పుష్ప, షయ్యాది వాసాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

### బొడ్రాయి ప్రతిష్ఠ



విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

**ముస్తాబాద్:** మద్దికుంటలో బొడ్రాయి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి, నవగ్రహాలకు ప్రత్యేక పూజల అనంతరం ధాన్యాధివాసం, పుష్పధివాసం చేశారు. మెట్టు రామశర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అంతకుముందు గణపతి హోమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు, మాజీ సర్పంచులు భాగ్యశ్రీ, కళ, నాయకులు జింక తిరుపతి, స్వామిగౌడ్, కరుణాకర్, భూమయ్య, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



**కోనరావుపేట:** కొలనూర్‌లోని సుద్దాల నరేశ్‌కు చెందిన భూమిలో ఐదేళ్ల నుంచి విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. సెస్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదు. వరి కోసే సమయంలో షాక్ కొడుతున్నాయి. అధికారులు స్పందించి సరి చేయాలి.

– వీరవేణి తిరుపతియాదవ్, కొలనూర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
దివ్య, సెస్ ఏఈ, సెల్ నం.: 9440814078

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

# 'బద్మాషులు' చిత్ర యూనిట్ సందడి



**సిరిసిల్లటౌన్:** జిల్లా కేంద్రంలో బద్మాషులు చిత్ర యూనిట్ ఆదివారం సందడి చేసింది. పట్టణంలో చిత్రం డైరెక్టర్ శంకర్ చేగూరి, హీరోలు మహేశ్ చింతల, విద్యాసాగర్ కారంపురితోపాటు పలువురు నటీనటులు ర్యాలీ నిర్వహించారు. తమ చిత్రం బద్మాషులు ఈనెల 6న విడుదలవుతుందని ప్రచారం చేపట్టారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ శంకర్ చేగూరి, హీరో మహేశ్ చింతల మాట్లాడారు. తారా స్టోరీ టెల్లర్స్ బ్యానర్‌పై నిర్మించిన చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. పూర్తి వినోదాత్మక కథా చిత్రమని, పల్లెటూరు వాతావరణ నేపథ్యంలో చిత్రీకరణ జరిగిందని అన్నారు. సినిమా ఔట్‌లుక్ బాగా వచ్చిందని, ప్రేక్షకులు ఆదరించి చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించాలని కోరారు. సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నేత కార్మిక కుటుంబానికి చెందిన విద్యాసాగర్ ఈ సినిమాలో హీరోగా నటించడం విశేషం.

### విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



**వేములవాడ:** ఇంటర్, 10వతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లా గౌడ విద్యార్థులకు గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్(గోప) జిల్లా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో వేములవాడ గౌడ భవనంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, గోప రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్ హాజరయ్యారు. ఇంటర్‌లో 950కి పైగా, 10వతరగతిలో 540 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేశారు. పురస్కారాల ఫండ్ ప్రదాత నేరెళ్ల తిరుమల్‌గౌడ్, గోప రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్‌గౌడ్, నర్సయ్యగౌడ్, విక్కుర్తి లక్ష్మీనారాయణ, రామచంద్రంగౌడ్, పులి లక్ష్మీపతిగౌడ్, దూలం సంపత్‌గౌడ్, విక్కుర్తి అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

**చందుర్తి:** రైతులు పండించే 14 రకాల పంటకు మద్దతు ధరను పెంచడాన్ని హర్షిస్తూ ఆదివారం మండల కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు మోకిలే విజేందర్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వేములవాడ అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య మాట్లాడుతూ.. దేశంలోని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టి రైతులను పంటల సాగులో చైతన్యపర్చుతున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పోంచెట్టి రాకేశ్, నాయకులు సిర్రం తిరుపతి, చింతకుంట సాగర్, మర్రి మల్లేశం, పెరిక గంగరాజు, హనుమయ్యచారి, బోరుగాయ తిరుపతి, మట్క మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### వంగిన విద్యుత్ స్తంభం



**వీర్నపల్లి:** మండల కేంద్రం నుంచి రాశిగుట్టతండాకు వెళ్లే రహదారి పక్కన అతి ప్రమాదకరంగా వంగి ఉన్న విద్యుత్ పోలు భారీ వర్షాలు, ఈదురు గాలులకు ఎప్పుడు పడిపోతుందోనని తండా గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే సరి చేయాలని కోరుతున్నారు.

### స్వచ్ఛందంగా చెత్త తొలగించారు



**రుద్రంగి:** మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేయకపోవడంతో గ్రామస్తులే స్వచ్ఛందంగా పారిశుధ్య పనులు చేసుకున్నారు. రెండు నెలలుగా రుద్రంగిలో చెత్త సేకరించడం లేదు. దీంతో విసుగు చెందిన గ్రామస్తులే ఆదివారం స్వచ్ఛందంగా కాలనీల్లోని పిచ్చిమొక్కలను పీకేసి ట్రాక్టర్‌లో వేశారు. ట్రాక్టర్‌లో వేసిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు.

### రేపటి నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు

**కోనరావుపేట:** మండలంలోని గ్రామాల్లో ఈనెల 3 నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 3న కొలనూర్, బావుసాయిపేట, 4న మర్తనపేట, వట్టిమల్ల, 5న ధర్మారం, కనగర్తి, 6న మల్కపేట, నిజామాబాద్, 9న కోనరావుపేట, మామిడిపల్లి, 10న రామన్నపేట, మరిమడ్ల, 11న నాగారం, నిమ్మపల్లి, 12న శివంగాలపల్లి, సుద్దాల, 13న వెంకట్రావుపేట, పల్లిమక్త, 16న కొండాపూర్‌లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు, ఆయా గ్రామాల ప్రజలు తమ భూసమస్యలపై దరఖాస్తులు సమర్పించాలని కోరారు.